క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కె.వి బుడమేరు కట్ట ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ డీఈఈ ఎంవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అయోధ్య నగర్ ఒకటో రోడ్డు నుంచి ఏడో రోడ్డు వరకు, చింత చెట్లు బజార్, గట్టా రత్తయ్య వీధి, అయోధ్యనగర్ డొంక రోడ్డు, సాయిబాబాగుడి రోడ్డు, శివాలయం, గన్నా బత్తుల బాబురావు వీధి , పసుపులేటి వారి వీధి, రామదాసు ఆదినారాయణ వీధి ,సూర్యబాల అపార్ట్‌మెంట్ రోడ్డు, బుడమేరు కట్ట ఏరియా, సూరిబాబు కాలనీ, శారదా స్కూల్ ఏరియా, క్షత్రియ భవన్ ఏరియా, ఆర్ ఎల్ పేట రెండో లైను తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీతోనే సమగ్ర అభివృద్ధి అని, ఫ్యాను గుర్తుకు ఓట్లువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. 29వ డివిజన్ మధురానగర్‌లో శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

ఆకట్టుకున్న హరికథా గానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన హరికథా గానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన గుడిపాటి కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గుడిపాటి జయరామ సుధాకర్ యాగ రక్షణపై హరికథా గానం చేశారు. జయరామ సుధాకర్‌కు వయోలిన్‌పై డాక్టర్ పాణ్యం దక్షణామూర్తి, మృదంగంపై కె.జగన్మోహని సహకారం అందించారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన హరికథా గానాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం హరికథా గానం చేసిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

భారత మహిళా మండలికి నూతన కార్యవర్గం



విజయవాడ కల్చరల్: భారత మహిళా మండలి విజయవాడ శాఖకు 2024–2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కార్యదర్శి వడ్డాది సూర్యకామేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షురాలిగా రుత్తా శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా తాడువాయి శిరేఖ, జాయింట్ కార్యదర్శిగా ఆర్ ఉషామాధవి, ఇమిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా వి.ఉమాదేవి, కమిటీ సభ్యులుగా జీవీఎల్‌కుమారి, టి.వసంతకుమారి, టి.దివ్యవాణి. ఎడ్వైజరి కమిటీ సభ్యులుగా ఎ.రత్నాలక్ష్మి, టి.సాయి లక్ష్మిలను ఎన్నుకున్నట్లు వివరించారు.

8 నుంచి నూకాలమ్మ జాతర

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం సమీపంలోని శ్రీ నూకాలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 9 గంటలకు కలశస్థాపన, 9 తేదీ అమ్మవారికి సన్నిధిలో విశేష కుంకుమార్చన జరుగుతాయని తెలిపారు. 10వ నుంచి 19వ తేదీ వరకు రోజుకో విశేష పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీ కృష్ణా నది నుంచి కలశాలతో నదీ జలాలతో ఊరేగింపు, అనంతరం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను నదీ జలాలతో అభిషేకం, 21వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు అమ్మవారి సంబరం జరుగుతుందని వివరించారు. 21వ తేదీ అమ్మవారి అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో శుక్రవారం తోట సీతారామయ్య, సీతారామమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ తోట వెంకయ్య పలువురు పేదలకు ఆర్థిక సాయం అందించారు. ఇంటి పైకప్పు రేకుల నిర్మాణం కోసం గుడ్డేటి శేషమ్మ, పులపాక బాయమ్మలకు ఆర్థిక సాయం, వృద్ధురాలు ఏసమ్మకు తోడ్పాటునందించారు. సహకార బ్యాంకు అధ్యక్షుడు ఏడుకొండలు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి జగ్జీవన్‌రామ్

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు
- ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నాయకులు.



జింఖానా మైదానం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



లూనాసెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద..



ఠాగూర్ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పోరాట యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ యువతకు స్ఫూర్తి అని, ఆ మహనీయుని ఆశయాలను నిజం చేసి చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. స్వాతంత్య్ర సమరయోధులు, దేశ తొలి ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం 'సెంట్రల్'లో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాలు పలు కార్యక్రమాల్లో పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

'సెంట్రల్' వైఎస్సార్ సీపీ కార్యాలయంలో

సింగ్‌నగర్ నందమూరినగర్‌లోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పార్టీ నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేతలు బెజ్జం రవికుమార్, గుండె సుందర్‌పాల్, ఉమ్మడి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక 59వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానా ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా.. దళిత సంఘాల నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేతలు కంభగళ్ల రాజు, ఒగ్గు గవాస్కర్, కండెల రాజు, నేరెళ్ల శివప్రసాద్, ఎండీ హఫీజుల్లా, చింతా శ్రీను, అమిత్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

■ సింగ్‌నగర్ లూనాసెంటర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కంభగళ్ల రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీటీసీ జాతీయ అధ్యక్షులు రెవ.మంగలపూడి జోసఫ్ పాల్గొని దళిత సంఘాల నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చింతపల్లి శ్రీనివాసరావు, టి.కొండయ్య, జవహర్, మోషే తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్ రామ్ 116వ జయంతి కార్యక్రమం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జింఖానా మైదానం సమీపంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల. జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, కెనడి, ప్రభాకర్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కమిషనరేట్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

■ ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గ్రేడ్ 2 గ్రంథాలయాధికారి జి. ఉమారాణి.. జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ గాంధీనగర్‌లోని డీపీఆర్టీయూ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం జరిగింది. ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేశారు. డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పేద వృద్ధులకు వస్త్రదానం చేశారు. వేసవి నేపథ్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్జీవో నాయకులు బీవీ రమణ, నజీర్, డీపీఆర్టీయూ నాయకులు మరి ప్రభాకర్. ఎంవీ నాగేంద్ర, శిరీష, కుమార్ రాజా, ఇర్ఫాన్ పాషా, కే శ్రీనివాస్, ఎస్ శ్రీనివాసరావు, మత్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు నిరంతరం కృషి చేసిన సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ అని 24వ డివిజన్ కారొరేటర్ కుక్కల అనిత అన్నారు. మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గిరిపురం మూడు బొమ్మల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బడుగు, బలహీనవర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

విజయవాడస్పోర్ట్స్: ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పరాస కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణరావు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పొలిమెట్ల శరత్‌బాబు, విజయవాడ సిటీ అధ్యక్షులు బూదాల శ్రీను, నేతలు షేక్ అమానుల్లా, వెలగలేటి భార్గవ్ రాయుడు, పచ్చిగళ్ల రమేష్, రాధా–రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుల హరికృష్ణ, నాగెళ్ల సంగీతబాబు, బి.పి.కుమార్, వి.థామస్, మెట్ల వరలక్ష్మి, చందా కిరణ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.



డీపీఆర్టీయూ కార్యాలయంలో వస్త్రదానం చేస్తున్న దృశ్యం

పోలీస్ కమిషనరేట్‌లో..

పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఏడీసీపీ టి.కనకరాజు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సింగ్‌నగర్ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనాసుల్తానా తదితరులు



గిరిపురంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యం



డివిజన్ కౌన్సిల్ సమావేశంలో సత్యవాణి, సంఘ్ నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికుల సంక్షేమమే తమ ముఖ్య అజెండా అని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి సత్యవాణి పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ రైల్వే ఆడిటోరియంలో డివిజన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు బ్రాంచ్ చైర్మన్‌లు, కార్యదర్శులు పలు సమస్యలను సత్యవాణి దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో సత్యవాణి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని తెలిపారు. సంఘ్ విజయవాడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరావు, ఆకుల రాఘవేంద్ర, సుకుమార్, రమేష్, డేగల శ్రీను, కొయ్య రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ ప్రభంజనంలో కూటమి కొట్టుకుపోతుంది

సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



26వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాను ప్రభంజనంలో కూటమి కొట్టుకు పోవటం ఖాయం అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 26వ డివిజన్ మారుతీనగర్‌లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల నాగేశ్వరరావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పాలనను జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. పేదలపై చంద్రబాబు నాయుడు కక్షసాధింపు చర్యలు చేపడతున్నారన్నారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్, మంగళగిరిలో లోకేష్‌లను ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో 175కు 175 సీట్లు గెలిచే సత్తా వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నేతలు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న శ్రీవిద్యా పాదుకాంత పూర్ణదీక్ష గ్రంథావిష్కరణ

విజయవాడ కల్చరల్: స్వామి పరమానంద(డాక్టర్ గ్రోవి పార్థసారథి) రచించిన శ్రీ విద్యా పాదుకాంత పూర్ణదీక్ష గ్రంథావిష్కరణ సభ మారుతీ గ్యాస్ కంపెనీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ మంగళవారం జరుగుతుందని నిర్వాహకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్ష్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు.





ఎండకు ముసుగు

భాస్కరుడి ప్రతాపానికి నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ ఎండ అధికమవుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రజలు రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. కొందరు టోపీలు ధరిస్తుంటే.. మరి కొందరు మహిళలు పమిట చెంగులనే ముసుగులుగా ఎండ నుంచి రక్షణ పొందుతున్నారు. కొందరు చిరువ్యాపారులు గొడుగులతో ఎండ నుంచి ఉపశమనం పొందుతున్న దృశ్యాలు శుక్రవారం నగరంలో కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



అత్త మందలించడంతో కోడలు, మనుమరాలు అదృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫోన్ మాట్లాడవద్దని అత్త మందలించినందుకు కోడలు, మనుమరాలు ఇంట్లోంచి వెళ్లిపోయిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఊర్మిళానగర్‌కు చెందిన మద్దెల లక్ష్మి పెద్ద కుమారుడు పూర్ణచంద్రరావు కుమార్తె తరచూ అపరిచితులతో ఫోన్‌లో మాట్లాడుతుంది. దీనిపై గతంలో దిశ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు.

ఇప్పుడు కూడా ఆమె ఫోన్‌లో మాట్లాడుతుండటంతో మద్దెల లక్ష్మి.. కోడలని మందలించారు. దీంతో కోడలు , మనుమరాలు మద్దెల లక్ష్మితో వాగ్వివాదానికి దిగారు. గురువారం తెల్లవారుజామున ఆమె నిద్రలేచిచూసేసరికి కోడలు, మనుమరాలు కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో గుణదల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

పాక్లయినర్ సామాను తీసుకువెళ్లిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: పాక్లయినర్ సామాను తీసుకువెళ్లిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట గురునానక్ కాలనీకి చెందిన ఎండి.షఫీవుల్లా కానూరు కొత్త ఆటోనగర్‌లో పాక్లయినర్ పాతసామాను వ్యాపారం చేస్తున్నాడు. కాగా అతను పాక్లయినర్ నాలుగు ట్రాక్ చైన్లు అతని షాపునకు ఎదురుగా ఉన్న ఫారూక్ షాపు ఆవరణలో ఉంచి చూడమన్నాడు.

అయితే జావేద్ అనే వ్యక్తి వచ్చి షఫీవుల్లా తమ్ముడు హిదయతుల్లా తనకు డబ్బులు ఇవ్వాలని దౌర్జన్యంగా నాలుగు ట్రాక్ చైన్లు తీసుకువెళ్లాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

జగన్ ప్రభుత్వాన్నే మళ్లీ కోరుకుంటున్నారు



స్థానికులతో మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ 'సెంట్రల్' ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం 63వ డివిజన్ సుందరయ్యనగర్, పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారికి బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హోసన్న ప్రార్థన మందిరం రోడ్డులో పలువురు మహిళలు వెలంపల్లి శ్రీనివాసరావుకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ టీడీపీ హయాంలో డివిజన్‌ను నిర్లక్ష్యం చేశారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేశారన్నారు. ఇళ్ల స్థలాలు రానివారికి మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందజేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని నానిలను అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలను కొనసాగించే సమర్థత జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ పసుపులేటి ఏసు, నేతలు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్కం కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, సిటీ మహిళా విభాగం కన్వీనర్ శివమ్మ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి 'వేగ' ప్రత్యేక ఆఫర్లు



పోస్టర్ ఆవిష్కరించిన నటి డింపుల్ హయతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు సంస్థ యజమానులు వనమా నవీన్, సుధాకర్ తెలిపారు. లబ్బీపేట నందమూరిరోడ్డులోని వేగ జ్యూయలర్స్ ఆభరణాల షోరూంలో ఉగాది పండుగా సందర్భంగా ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక ఆఫర్ల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి, సినీ నటి డింపుల్ హయతి పోస్టర్ ఆవిష్కరించారు. షోరూం లోని ప్రత్యేక ఆభరణాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. అధునాతన ఆభరణాలతో పాటు సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పే విభిన్న ఆభరణాలను ఖాతాదారులకు అందిస్తున్న సంస్థ అధినేతలు నవీన్, సుధాకర్‌లను అభినందించారు.

ఈ సందర్భంగా సంస్థ అధినేతలు మాట్లాడుతూ ఉగాది సందర్భంగా వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఆఫర్లు ఏప్రిల్ 30 వరకు ఉంటాయన్నారు. ఈ నెలలో అనేక వివాహ ముహూర్తాలు ఉన్నందున మా షోరూంలో అందిస్తున్న ప్రత్యేక ఆఫర్లను అంది పుచ్చుకుని, వేగ ఆభరణాలతో వివాహ వేడుకను మరింత వైభవోపేతంగా జరుపుకోవాలన్నారు. ఉగాది పర్వదినం, శుభముహూర్తాలను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ సిద్ధమైన ఆభరణాలను షోరూం లో విస్తృత శ్రేణిలో ఏర్పాటు చేశామన్నారు. బంగారం కొనుగోలుపైన ప్రతి గ్రాముకు రూ.250, అలాగే పాత బంగారం మార్పిడి పైన అదనంగా రూ.150 తగ్గింపు, డైమండ్ జ్యూయలరీ క్యారట్ ధర రూ. 54వేలు అందిస్తామని, పోల్కీ జ్యూయలరీ పైన ఎలాంటి తయారీ, తరుగు చార్జీలు ఉండవని యాజమాన్యం ప్రకటించింది. ఖాతాదారులకు నూతన తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రతి నెలా 5వ తేదీన నిర్వహించే ఈసీసీఈ కార్యక్రమంలో భాగంగా, బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతినికూడా పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కేఎల్ రావు నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు చేసే ఆటపాటలను వారి తల్లుల ముందు ప్రదర్శింపజేశారు. బాల్య దశ సంరక్షణ, ప్రాథమిక విద్య వంటి అంశాలపై నిర్వహించే వివిధ రకాల ఆటలు, కథలపై ప్రీ స్కూల్ పిల్లల తల్లులకు వివరించారు. బాబు జగ్జీవన్‌రామ్ గొప్పదనం తెలియజేస్తూ అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై. సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట):గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో శుక్రవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరప్పాడుతండ, రావిరాల, జయంతిపురం, కెఅగ్రహారం, బూదవాడ గ్రామాలకు చెందిన పెద్దలను ఘనంగా సత్కరించారు. వారికి నూతన వస్త్రాలు, స్వీట్లు బహూకరించారు. అనంతరం కంపెనీ ప్రెసిడెంట్ ఆషిష్ కుమార్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ ఉగాది పండుగ అందరి జీవితాల్లో కొత్తవెలుగులు నింపాలని ఆకాంక్షించారు.